మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం
11 నవంబర్ 2026
పేజీలు : 5
@mvaartanews
www.mivaartanews.com

లాభాల కోసం 99 శాతం ప్రజల ప్రాణాలను పణంగా పెడతారా?

- ప్రజల ప్రాణాలే ముఖ్యమా.. ఇసుక ర్యాంపుల ఆదాయమే ముఖ్యమా? ప్రభుత్వం తేల్చుకోవాలి.
- ఇసుక ర్యాంపులను సంపూర్ణంగా రద్దు చేయాలి -
- లోక్ రక్షక్ పార్టీ వ్యవస్థాపకుడు కొండా చరణ్.

చర్ల నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఇసుక ర్యాంపులను ప్రభుత్వం తక్షణమే సంపూర్ణంగా రద్దు చేయాలని లోక్ రక్షక్ పార్టీ (ఎల్ఆర్పీ) వ్యవస్థాపకుడు కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఒక శాతం మందికి లాభాలు చేకూర్చడం కోసం 99 శాతం మంది ప్రజలకు అన్యాయం చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చర్ల మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి దుర్గామాత ఆలయం సమీపంలో లోక్ రక్షక్ పార్టీ, మహిళా రక్షణ సంఘం సంయుక్త కార్యాచరణలో భాగంగా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కొండా చరణ్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీల ఆర్థిక అభివృద్ధి కోసం సహకార సంఘాల ద్వారా నిబంధనలకు అనుగుణంగా ఇసుక ర్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు ఇసుక తవ్వకాలు చేపడుతూ,



అనుమతించిన లోతు, వెడల్పు వంటి నిబంధనలను సైతం పట్టించుకోకుండా ర్యాంపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇసుక లారీల రాకపోకలతో రైతుల పంట పొలాలు దుమ్ము ధూళితో దెబ్బతింటున్నాయని, ప్రజలు కంటి సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఇసుక రవాణా కారణంగా ప్రజలకు ఉపయోగపడే రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారుతున్నాయని, దీంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయని అన్నారు. రహదారుల మరమ్మతుల కోసం మళ్లీ ప్రజాధనాన్నే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇసుక ర్యాంపులతో ఎలాంటి సంబంధం లేని సామాన్య ప్రజలు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారని, కొందరు ప్రాణాలు కోల్పోతుండటంతో వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ర్యాంపుల నిర్వహణను ప్రశ్నించే ప్రజలను సహకార సంఘాల సభ్యులు, లబ్ధి పొందుతున్నవారు బెదిరింపులకు గురిచేస్తున్నారని, విలేకరులపై దాడులకు సైతం తెగబడుతున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారం కారణంగా ఐకమత్యంగా ఉండే ఆదివాసీ సమాజంలో విభేదాలు ఏర్పడి, గ్రూపులుగా విడిపోయి పరస్పరం దూషించుకోవడం, ఘర్షణలకు దిగడం బాధాకరమన్నారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం ఆదాయంపైనే దృష్టి పెట్టడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సైతం ఒక శాతం మంది లాభాలా? లేక 99 శాతం మంది ప్రజల సంక్షేమమా? అన్నది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రజల ప్రాణ రక్షణ, సంక్షేమం కోసం లోక్ రక్షక్ పార్టీ చేపడుతున్న ఇసుక ర్యాంపుల సంపూర్ణ రద్దు ఉద్యమానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని, పార్టీలకు అతీతంగా ఏకమై ఇసుక ర్యాంపుల రద్దు కోసం ముక్తకంఠంతో గళమెత్తాలని కొండా చరణ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు కొండా ప్రమోద్, చర్ల మండల అధ్యక్షుడు ఎస్.కె. జహరుద్దీన్ భాష, మహిళా సంఘం నాయకులు వెంకటలక్ష్మి, కె. స్వరూప, సంధ్య, రాధ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి.

- రెండు పడక గదుల ఇళ్ల ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల ను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. క్షేత్రస్థాయిలో పలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని



తెలిపారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, త్రాగునీటి సరఫరా తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్ లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి భూమే భూ రీ-సర్వేకు ప్రమాణికం.

- రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.
- ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో కాల్వగట్ల పై బైక్ పై ప్రయాణించి నిర్వహించి భూ రీ సర్వే ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

రీ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన రికార్డులను రూపొందించడం కోసం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి రెవెన్యూ గ్రామంలో పొలం కాల్వగట్ల పై ద్విచక్ర వాహనం లో ప్రయాణించి కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న విధానం, ఇప్పటివరకు పూర్తయిన, మిగిలిన ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశ్యం, సర్వే నిర్వహణ విధానం, భూ రికార్డుల క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతులు అడిగిన సందేహాలు, అనుమానాలను తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి అంశాన్ని రైతుల సమక్షంలో పరిశీలించి, వాస్తవాలను మాత్రమే నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలోని భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలు రికార్డులతో సరిపోని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.భూమి హద్దుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, వివాదాలు తలెత్తకుండా రీ-సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ విస్తీర్ణానికి మధ్య తేడా ఉంటే, చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని అన్నారు.సర్వే సందర్భంగా సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు.సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ తదితర అవసరమైన వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు.ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల్లోని వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న తేడాలను సాంకేతికంగా పరిశీలించి, మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం



చేస్తూ భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని సూచించారు.అధునాతన రోవర్, ట్యాబ్ తదితర సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన భూ యజమానులు, సాగుదారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించే విధంగా రీ-సర్వేను పారదర్శకంగా పూర్తి చేసి, అర్హులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందేలా భూ రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తమ వద్ద ఉన్న సంబంధిత భూ పత్రాలను అధికారులకు అందజేస్తూ సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించే రీ-సర్వే ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలను తగ్గించి, భూ రికార్డుల్లో మరింత స్పష్టత తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరుపై హర్షం సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు.

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.
- ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 4.29 లక్షల మందికి పింఛన్లు మంజూరు.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయడంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ఆరు గ్యారంటీలలో భాగంగా వికలాంగులు, ఒంటరి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా 4.29 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రివర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.గత ప్రభుత్వం ధనిక తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని, ప్రభుత్వ ఉద్యోగులకు 7వ, 10వ తేదీల్లో జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని ఆయన గుర్తుచేశారు. ఆ పరిస్థితిని అధిగమించి, 2024 జనవరి 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5వ తేదీన, సంక్షేమ ఉద్యోగులకు 10వ తేదీన జీతాలు ఇస్తూ, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి ఈ 34 నెలల్లో రూ. 2 లక్షల కోట్లకు పైగా చెల్లించి, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.బడుగు, బలహీన, అన్ని వర్గాల ప్రజాక్షేమాన్ని కోరే కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నారాయణ స్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు.



ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



ఖమ్మం నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ ఎన్.పి.ఎల్ 2026--27లో భాగంగా బ్రాంచ్ లెవల్ ఈ కిడ్స్ స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.రాంకీ హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆర్‌అండ్ హెడ్ సంగీత, ఆర్.ఐ క్రాంతి కుమార్, కో ఆర్డినేటర్ నీలిమ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో క్రీడలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ కిడ్స్ టీచర్స్, పీఈటీలు చందు పావని, లైఫ్ స్కిల్స్ ట్రైనర్స్ యశ్వంత్, నరేష్ పాల్గొన్నారు.

నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం.

- చల్లగుళ్ల నరసింహారావును సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన.
- మాజీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు,
- ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు.



సత్తుపల్లి నవంబర్ 10 మీ వార్త అర్ సి:

సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన చల్లగుళ్ల నరసింహారావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు నూతన చైర్మన్‌ను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దోమ ఆనంద్ బాబు మాట్లాడుతూ.నూతన బాధ్యతలు చేపట్టిన చల్లగుళ్ల నరసింహారావు రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.అనంతరం ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు సైతం నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, పిల్లి మల్లికార్జున్, మట్టా చెన్నారావు, రమేష్ తన్నీరు, శ్రీను, గుంజా వెంకటేశ్వరరావు, బల్లెం చిరంజీవి తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

నిరుపేద డాడీ లంబాడి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



తెలంగాణ రాష్ట్ర డాడీ లంబాడి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు రఘునాయక్ గారి ఆదేశాల మేరకు, రాష్ట్ర కార్యదర్శి డుంగ్రోత్ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం డాడీ లంబాడి కుటుంబాల ప్రతినిధులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసం వద్ద ఆయన వ్యక్తిగత



సహాయకులు, క్యాంపు ఆఫీస్ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రస్థాయిలో లంబాడీలకు ఎస్టీ కమిషన్ ద్వారా ప్రత్యేక గుర్తింపు కల్పించినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం ఖమ్మం నగరంలో నివసిస్తున్న నిరుపేద డాడీ లంబాడి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డుంగ్రోత్ కిషోర్ నాయక్,దేవత్ కాళిదాస్, దేవత్ అంకుష్,ధోణవాన్ వెంకట్రావు నాయక్, ధోణవాన్ నాగరాజు, రత్నావత్ ఉపేందర్, డుంగ్రోత్ సుశీల్, డుంగ్రోత్ వీరబాబు, మహిళలు డి. పుష్ప, ధోణవాన్ కీర్తి, దేవత్ మోతి, డి. సునీత తదితరులు పాల్గొన్నారు.

సీతారామ నీటిని బయ్యారం చెరువుబుగ్గవాగుకు అనుసంధానం చెయ్యాలి గుడిపూడి తిరుమల రావు.

కారేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



సింగరేణి మండలంలో సాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే సీతారామ ప్రాజెక్టు నీటిని బయ్యారం చెరువు బుగ్గ వాగులకు అనుసంధానం చేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో మంగళవారం మాట్లాడుతూ మండలంలో సాగునీటి వనరులు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉంటాయన్నారు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగునీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆశీస్సులు, సహకారంతో సీతారామ ప్రాజెక్టు నీటిని మండలంలోకి తరలించేలాబృహత్తర కార్యాన్ని సాధిస్తాం!. బాబు వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను బయ్యారం చెరువు, బుగ్గవాగుకు అనుసంధానం చేసి, గేట్ కారేపల్లి సహా పరిసర గ్రామాల చెరువులకు సాగునీరు అందించడమే మా లక్ష్యం. అన్నారు. రైతుల సంక్షేమమే మా ధ్యేయమని ప్రతి చెరువుకు గోదావరి జలాలు అందించడంతోపాటు రైతులకు ప్రయోజనం చేకూర్చాలని మా సంకల్పం అన్నారు. ఈ అనుసంధానానికి అవసరమైన సాంకేతిక సర్వే, కాలువలు, పైప్‌లైన్ల నిర్మాణ ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, కార్యరూపం దాల్చేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

- అందరికీ పనులు కల్పిస్తాం గ్రామ సర్పంచ్.

కారేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



గ్రామపంచాయతీలో ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తామని రావోజీ తండా గ్రామ సర్పంచ్ బాలు నాయక్ పంచాయతీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ లు అన్నారు.ఎల్ నినో ప్రభావంతో, పనులు లేకుండా ఇబ్బందిగా ఉన్న, ఉపాధి కూలీలు పని కావాలని దరఖాస్తు చేసుకోగా వారికి మంగళవారం పనులు కల్పించారు. పై అధికారుల ఆదేశాల ప్రకారం, వి బి జి రాంజీ కార్యక్రమంలో భాగంగా పని కల్పించడంతోపాటు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా ఎవరికైనా పనులు కావాలంటే గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని, పని అడిగిన వారందరికీ పని కల్పించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మేట్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్. ఐ. వి. రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు.

కారేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



కారేపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా నూతన బాధ్యతలు స్వీకరించిన వి. రమేష్ ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల శాంతి భద్రతలవిషయం లో అధికారులకు కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎల్లప్పుడూ పూర్తి సహాయాసహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బోళ్ల రమేష్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు కడియాల సుధాకర్, పార్టీ మండల సమన్వయ కర్త వాంకుడోత్ గాంధీ తదితరులు పాల్గొన్నారు

ఇల్లందు పట్టణంలోని పేదల సమస్యలను పరిష్కరించాలి: సిపిఐ డిమాండ్.

ఇల్లందు నవంబర్ 10 మీ వా ర్త ప్రతినిధి:



ఇల్లందు పట్టణ పరిధిలోని 21వ వార్డు పరిధిలోని తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్, పి.ఎస్.పి బస్తీ, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్న నిరుపేద ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, తిలక్ నగర్ మరియు విజయలక్ష్మి నగర్‌లలో దాదాపు 60 నుంచి 80 సంవత్సరాలుగా మూడు గ్రామ పంచాయతీలొ గల సుమారు 4000 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అయితే ఇప్పటివరకు వారికి ఇంటి పట్టాలు ఇవ్వకపోవడం వల్ల ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంక్ రుణాలు లేదా ఇందిరమ్మ ఇళ్లు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వే నిర్వహించి జి.ఓ. నెం. 76 ప్రకారం అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు సింగరేణి స్థలంలో నివసించే వారికి సింగరేణి యాజమాన్యం నుంచి ఎన్ఓసీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజీవ్ నగర్, సి.ఎస్.పి బస్తీలలో నివసిస్తున్న కుటుంబాలకు కనీస మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరియు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. నీరు, విద్యుత్ లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు తక్షణమే స్పందించి సర్వే చేపట్టి ఈ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డివిజన్ సిపిఐ కార్యదర్శి కే సారయ్య జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్ మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ పట్టణ కార్యదర్శి భాస శ్రీనివాసరావు మండల కార్యవర్గ సభ్యులు ఆకుల చందర్ బంటు యాదగిరి రాము గుడిపల్లి భాస్కర్ ధరావత్ రాందాస్ వాసబోయిన సారయ్య వలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి.

- 36వ అఖిల భారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలి: మచ్చా రామారావు.

చర్ల నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం చర్ల మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు. చర్ల మండల పరిధిలోని ఆనంద్ కాలనీలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్యామల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మచ్చా రామారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా రైతులను నిరాశకు గురిచేస్తున్నాయని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. మరోవైపు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి మాట్లాడుతూ రైతాంగ హక్కుల సాధన కోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బండెల చంటి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతు ఉద్యమ నాయకులు, మేధావులు, ప్రముఖులు కలిపి సుమారు 1,500 మంది ఈ మహాసభలకు హాజరుకానున్నారని తెలిపారు. రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతుల హక్కులు తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. చర్ల మండలం నుంచి రైతులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆనంద్ కాలనీకి చెందిన రైతులు, మహిళలు, రైతు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస శోభతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న రామన్నపాలెం గ్రామం.

- శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు.

సత్తుపల్లి నవంబర్ 10 మీ వార్త అర్ సి:



ఖమ్మం జిల్లా వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామం,పరిసర ప్రాంతాల్లో భక్తి భావాన్ని చాటిచెప్పేలా రామన్నపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత కోటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నవంబర్ 10, 2026 నుంచి డిసెంబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.కార్తీకమాసం శివారాధనకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో భక్తుల ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ఉద్దేశంతో ఆలయ పూజారి ఊటుకూరి భార్గవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈ కార్తీకమాసం సందర్భంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సాయంకాలం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేయించుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక కార్యక్రమాలు.

నవంబర్ 9న ఆకాశదీపం ప్రారంభం.

నవంబర్ 13న నాగుల చవితి ప్రత్యేక పూజలు.

నవంబర్ 16న తొలి కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు.

నవంబర్ 23న రెండవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు: నవంబర్ 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు అత్యంత వైభవంగా జ్వాలాతోరణం కార్యక్రమం.

నవంబర్ 30న మూడవ కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు.

డిసెంబర్ 8న కార్తీక అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహణ.

కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే జ్వాలాతోరణం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.ఈ నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, తమ గోత్రనామాలతో అభిషేకాలు చేయించుకోవాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ, భక్తి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ అర్చకులు ఊటుకూరి సూర్య భార్గవ శర్మదేవస్థాన కమిటీరామన్నపాలెం

ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా.. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా 63 మంది లబ్ధిదారులకు రూ.63.07 లక్షల ఆర్థిక సాయం అందజేత.

సత్తుపల్లి నవంబర్ 10 మీ వార్త టౌన్ రిపోర్టర్:



సత్తుపల్లి పట్టణం, సత్తుపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి పట్టణం, మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు రూ.27,03,132, సత్తుపల్లి మండలానికి చెందిన 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మొత్తంగా 63 మంది లబ్ధిదారులకు రూ.63,07,308 ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆడబిడ్డల వివాహ సమయంలో తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రెండు రాష్ట్రాల స్థాయి సోలో డాన్స్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర.

ఇల్లందు నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

ఇల్లందు భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ఇల్లందు పట్టణంలోని ఎం ఆర్ జి నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించనున్న తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సోలో డాన్స్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఈరోజు ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర గారు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర గారు మాట్లాడుతూ కళలు, సంస్కృతి, నృత్య రంగాలకు ప్రోత్సాహం అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన కళాకారులు ఉన్నారని, వారికి సరైన వేదిక కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ ఇలాంటి కార్యక్రమాలను



నిర్వహించడం ద్వారా కళాకారులను ప్రోత్సహించడం సంతోషకరమని, ఈ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న ఈ రాష్ట్ర స్థాయి సోలో డాన్స్ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొననున్నారు. వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ కేటగిరీలుగా పోటీలు నిర్వహించడంతో పాటు ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కడారి వెంకటేష్ మాట్లాడుతూ కళాకారులకు ఒక మంచి వేదిక కల్పించాలనే సంకల్పంతో ఈ రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరి, భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కడారి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు ఏ. శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, రాజేష్, సాయి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవ సదస్సును విజయవంతం చేయాలి.

- మల్లారంలో కరపత్రాలు విడుదల చేసిన బీఎస్పీ నాయకులు.

చర్ల నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా చర్ల మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ సదస్సును విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు పిలుపునిచ్చారు.
బీఎస్పీ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు చెన్నం మోహన్, చర్ల మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు ఆధ్వర్యంలో మల్లారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీఎస్పీ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి కేసుపాక కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీసంపల్లి నరసింహారావు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను



విడుదల చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 26న నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ సదస్సుకు బీఎస్పీ చీఫ్ జోనల్ ఇన్‌చార్జి దాగిళ్ల దయానంద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి సదస్సును విజయవంతం చేయాలని, భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు ధ్రువ నరసింహారావు, కాకా నరసయ్య, సోయం శ్రీమూర్తి, దుమ్ముగూడెం మండల సీనియర్ నాయకులు కంచర్ల సింహాద్రి, తాటి మోతురి, ఇరప ధర్మరాజు, పాయల ప్రమీల, శంకర్, బోసు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం...!

- స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో తప్పించుకున్న వృద్ధురాలు, చిన్నారులు.

- శిథిలావస్థలో నివాసం.. ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం.

- ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని వృద్ధురాలి వేడుకోలు.

నేలకొండపల్లి నవంబర్10 మీ వార్త ఆర్ సి:

తృటిలో పెను ప్రమాదం తప్పింది. శిథిలావస్థకు చేరిన ఇంటి స్లాబ్ నుంచి ఒక్కసారిగా పెచ్చులు ఊడిపడటంతో ఇంట్లో ఉన్న వృద్ధురాలు, ఇద్దరు చిన్నారులు భయంతో బయటకు పరుగులు తీశారు. రెప్పపాటులో పక్కకు జరగడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.ఈ ఘటన నేలకొండపల్లి మండలం మంగాపురంతండాలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మంగాపురంతండాకు చెందిన పాల్తీయ సక్కుబాయి (55) తన మనవరాళ్లు జ్యోశిక (9), హేమశ్రీ (6)లతో కలిసి శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నివసిస్తోంది. వృద్ధురాలికి కంటి చూపు కూడా సరిగా లేకపోవడంతో నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా ఇంటి స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి.అదే సమయంలో సక్కుబాయితో పాటు చిన్నారులు కూడా ఇంట్లోనే ఉండటంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని పసిగట్టి వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, చిన్నారుల తల్లి వారిని వదిలివెళ్లడంతో అమ్మమ్మ సక్కుబాయే వారి ఆలనాపాలనా చూసుకుంటోంది. తనకు కంటి చూపు సరిగా లేకపోయినా, మరోవైపు ఎలాంటి అండదండలు లేకపోయినా ఇద్దరు చిన్నారులను పోషిస్తూ జీవనం సాగిస్తోంది. నివాసం ఉండే ఇల్లు కూడా శిథిలావస్థకు





చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ దుస్థితిని పరిశీలించాలని వృద్ధురాలు కోరుతోంది. తనకు సురక్షితమైన ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు, ఆసరా పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటోంది. చిన్నారులతో కలిసి ప్రాణభయంతో జీవిస్తున్న తమ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని సక్కుబాయి విజ్ఞప్తి చేస్తోంది.

నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్.

- పోలీసుల పనితీరుపై సమీక్ష.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం.

నేలకొండపల్లి నవంబర్10 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, వివిధ కేసులకు సంబంధించిన వివరాలు,సిబ్బంది పనితీరు,కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో స్వీకరించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే కేసులు,వాటికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నేర నమోదు వ్యవస్థలో పొందుపరచాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమాజంలో యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగానికి పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన



చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు,ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరురోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్,సందేశాలు, అనుమానాస్పద లింకులు, మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల పట్ల ప్రజలకు తగిన సూచనలు చేయాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు ఆలస్యం చేయకుండా పోలీసులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.
అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి భద్రత విషయంలో నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, విచారణలో జాప్యం లేకుండా ప్రతి కేసును నిరంతరం సమీక్షించాలని అధికారులకు సూచించారు.కేసులకు సంబంధించిన ఆధారాలను సేకరించి, సాక్షులను విచారించి, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలతో పోలీస్ కమిషనర్ నేరుగా మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు సేకరించారు.ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్ట ప్రకారం న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించడం, శాంతిభద్రతలను కాపాడటం,నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు.విధుల నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

కోట మైసమ్మ ఆలయం రహదారికి సీఎస్ఆర్ నిధులు మంజూరు.

- డబల్ రోడ్, సెంట్రల్ లైటింగ్ తో కొత్త అందాలు.

- వైరా ఎమ్మెల్యే చొరవ తో సింగరేణి నిధులు

పర్సా ట్రస్ట్ చైర్మన్ పట్టాభి రామారావు.





కారేపల్లి నవంబర్10 మీ వార్త ప్రతినిధి:

సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ తల్లి ఆలయం వరకు గల ప్రధాన రహదారి కొత్త అందాల సంతరించుకోనుంది. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ ప్రత్యేక చొరవతో సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.3కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కారేపల్లి – ఇల్లందు ప్రధాన రహదారి నుండి కోట మైసమ్మ తల్లి ఆలయం వరకు డబల్ రోడ్డు బిటి, సెంట్రల్ లైటింగ్ సిస్టంతో నిర్మించనున్నారు. దీనికి సంబంధించి మంగళవారం పంచాయతీరాజ్ శాఖ ఈఈ మహేష్ బాబు, డీఈ కరుణాకర్ రెడ్డి, మండల ఏఈ రాజశేఖర్ లు ప్రతిపాదిత రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు కొలతలు వేసి హద్దులు నిర్ణయించినారు. ఈ కార్యక్రమం లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఆలయ ఈవో కె వెంకటయ్య, పగడాల మోహన్ కృష్ణ, పర్సా సాయి లలిత్ అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, ఉసిరికాయలపల్లి, భాగ్యనగర్ తండా, పోలంపల్లి, సీతారాంపురం సర్పంచ్ లు వరలక్ష్మి రాజు, బానోత్ హీరాలాల్ హేమలత బాలాజీ, మూడు కిషోర్, గ్రామస్థులు పాల్గొన్నారు. కోట మైసమ్మ ఆలయ రోడ్డు నిర్మాణానికి సింగరేణి సంస్థ ద్వారా సిఎస్ఆర్ నిధులు మంజూరుకు కృషి చేసిన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ కు ఆలయ ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, కే.వెంకటయ్య లు కృతజ్ఞతలు తెలిపారు.

భూ నిర్వాసితులకు యధాతధంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- నిర్వాసిత కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ కుమార్.

కారేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అనుబంధ సంస్థ మాదారం డోలమైట్ మైన్ నందు భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు యధాతధంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ అజ్మీర్ నరేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని మాదారం గ్రామంలో మంగళవారం మాట్లాడుతూ ఇటీవలభూ నిర్వాసిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేయగా తక్షణమే స్పందించిన తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం ఆర్డిఓ శ్రీనివాసరావు సింగరేణి మండలం ఎమ్మార్వో వెంకటేశ్వర్లు కు భూ నిర్వాసిత కుటుంబాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు.తెలంగాణ రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో మాదారం వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి భూ నిర్వాసితులకు యధాతధంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మార్వో ద్వారా నోటీసులు అందజేసినట్లు తెలిపారు. భూ నిర్వాసిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ సర్పంచ్ అన్నారు.

మైనారిటీ గురుకుల కళాశాలలో ఆకస్మిక తనిఖీ.

- జిల్లా ప్రాంతీయ స్థాయి సమన్వయకర్త (ఆర్.ఎల్.సి).

సత్తుపల్లి నవంబర్ 10 మీ వార్త అర్ సి:



సత్తుపల్లి గుడిపాడు రోడ్డులో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ స్థాయి సమన్వయకర్త కే.వెంకటరామయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, విద్యార్థుల విద్యా ప్రగతిని నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అనంతరం విద్యార్థులు నిద్రించేగదులు, వంటశాల, తాగునీటి ప్లాంట్, కళాశాల ఆవరణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ రోజూ మెనూ ప్రకారం సక్రమంగా విద్యార్థులకు భోజనం అందించాలని వార్డెన్ వంట సిబ్బందికి సూచించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు నివేదిక ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ వై. శేషగిరిరావు కు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ- ముగ్గురికి గాయాలు.

కారేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

సింగరేణి సింగరేణిమండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో మంగళవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన మొక్కపాటి రాంప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుండి వస్తుండగా, గిద్దవారిగూడెం చెందిన మైనర్లు అయిన ఇరువురు యువకులు కన్నెబోయిన గణేష్,గోసి విజయ్ లు అతివేగంగా ఖమ్మం వెళుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టారు.దీంతో గాదెపాడు గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, ఢీ కొట్టిన ద్విచక్ర వాహనదారులైన ఇరువురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసం అయిపోయాయి.కాగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వాహనంతో వచ్చి ఢీ కొట్టిన యువకులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత గాదేపాడు గ్రామానికి చెందిన వ్యక్తిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

వి.డి.ఓ.స్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో రెండవ ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం.

- జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



స్థానిక గాంధీ చౌక్ వద్ద గల చాంబర్ ఆఫ్ కామర్స్ లో విజయవంతంగా నడుస్తున్న ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రానికి కొనసాగింపుగా, వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు ఖమ్మం పట్టణంలోని వి.డి.ఓ.స్ కాలనీలో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో 2వ ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో వివిధ రకాల బియ్యం ధరలను నిర్ణయించడం జరిగిందని, బిపిటి,కెఎన్ఎమ్ రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్,తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ. 74, హెచ్ఎంటి,జెఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79 చొప్పున విక్రయించబడతాయని అన్నారు. మార్కెట్ కు వచ్చిన వినియోగదారులు బియ్యం కొనుగోలుకు విశేషంగా ముందుకు వచ్చారని, తమ ప్రాంతంలోనే నాణ్యమైన బియ్యం ప్రభుత్వం నిర్ణయించిన సరసమైన ధరలకు లభించడం పట్ల ప్రజలు సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల వినియోగదారులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆ ప్రకటనలో కోరారు.

సీతారామ ప్రాజెక్టు కాలువ వలన విలువైన భూములను కోల్పోతాం.

- జీవనోపాధి దెబ్బతింటుంది.
- కాలువ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను రద్దు చేయాలి.
- తాసిల్దార్ కు విన్నవించిన కొండాయిగూడెం, కొమ్మినేపల్లి గ్రామాల రైతులు.

కామేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



కామేపల్లి మండలం కొండాయిగూడెం, కొమ్మినేపల్లి గ్రామాల పరిధిలో సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను రద్దు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం



తాసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.వి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. కాలువ ప్రతిపాదన వల్ల తమ వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.తరతరాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు భూములే జీవనాధారమని పేర్కొన్నారు.కాలువ నిర్మాణం కారణంగా భూములు కోల్పోవాల్సి వస్తే తమ కుటుంబాల జీవనోపాధి దెబ్బతిం టుందని వాపోయారు.ఈ నేపథ్యంలో కాలువ ప్రతిపాదన ను ఉపసంహరించు కోవాలని తద్వారా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మద్దినేని బాలగోపాల్, ముత్యాల వెంకటేశ్వర్లు, జె. శ్రీను, నిర్మల, మల్లయ్య, రాజు, వినోద్ కుమార్, నాగేష్, పాపారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాదావత్ తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ బంజరలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ ఆరెం అచ్చమ్మ

- జల సంరక్షణే భవిష్యత్తుకు భరోసా.
- ఎంపీడీవో ధరావత్ సోంలాల్.

కామేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:



కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామం లో సర్పంచ్ ఆరెశ అచ్చమ్మ ఇంకుడు గుంతల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించా రు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో ధరావత్ సోంలాల్ మాట్లాడుతూ.. జల సంరక్షణే భవిష్యత్తుకు భరోసా అన్నారు. ప్రతి ఇంట ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అద్దంకి శ్రీరాణి, ఈసీ దామాల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ మూతి శ్రీను, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో శ్రీ మంగళ గౌరీ సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో నిత్య ధార్మిక కార్యక్రమాలు

జహీరాబాద్ : జహీరాబాద్ పట్టణంలోని అల్లోల్ రోడ్డులో గల శ్రీ మంగళ గౌరీ సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామి మందిరంలో భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం వివిధ ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం, అమావాస్య పర్వదినాల్లో ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా ఆలయంలో కుంకుమార్చన, స్వామివారికి అభిషేకం, లక్ష్మీదేవి పూజ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయ ఈఓ విభూతి శివరుద్రప్ప ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు సంగమేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగుతున్నాయి. కార్తీక సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు .



డాక్టర్ విధుల్లో ఉన్నారా..?లేక విధులకే దూరమా..?

- కల్లూరు పశువైద్య శాఖలో అంతులేని నిర్లక్ష్య ఆరోపణలు !
- ఆసుపత్రిలో వైద్యు అధికారిని కరువు.. రైతులకు సమాధానాలు మాత్రం ఘాటు !
- ప్రశ్నిస్తే బాధ్యతాయుత సమాధానం లేదు..
- పైగా నిర్లక్ష్యపు ధోరణి!
- మూగజీవాల ప్రాణాలతో చెలగాటమా..?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ గాలికొదిలేశారా..?

సత్తుపల్లి నవంబర్ 10 మీ వార్త అర్ సి:

మూగజీవాలకు వైద్యం అందించాల్సిన పశు వైద్యశాఖలోనే విధుల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు అండగా నిలవాల్సిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అన్న అనుమానాలు కల్లూరు మండలంలో వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రికి వెళ్తే వైద్య అధికారిని కనిపించరనే ఆరోపణలు.. అత్యవసర సమయంలో వైద్యం కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు.. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ, కల్లూరు పట్టణ పశు వైద్య కేంద్రం ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న వైద్య అధికారిని పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విధుల సమయంలో వైద్య అధికారిని అందుబాటులో ఉండటం లేదని, పశువైద్య కేంద్రానికి వెళ్లిన రైతులకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆసుపత్రి ఎక్కడ..? డాక్టర్ ఎక్కడ..?

ప్రభుత్వం ప్రజల కోసం పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. వాటిలో వైద్యులు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత లేదా? విధుల సమయంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోతే రైతులు ఎవరిని ఆశ్రయించాలి? పశువులకు అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎవరు బాధ్యత వహించాలి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నిస్తే, రైతుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నామని సమాధానం చెబుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆ సేవలు ఎప్పుడు, ఎక్కడ, ఎంతమందికి అందుతున్నాయో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేరా..? ఇదేనా అధికారుల బాధ్యత..?

విధుల నిర్వహణపై వివరణ కోరిన పాత్రికేయుల పట్ల వైద్యాధికారి స్పందించిన తీరు కూడా విమర్శలకు తావిస్తోంది. 'వార్తలు రాసుకోండి.. ఎవరికైనా చెప్పుకోండి.. మీరేం రాసుకుంటారో రాసుకోండి' అంటూ అసహనంగా స్పందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా? విధులపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూగజీవాల ప్రాణాలు చవకైపోయాయా..?

పశువులే జీవనాధారంగా బతుకుతున్న చిన్న, సన్నకారు రైతులకు పశువైద్య సేవలు అత్యంత కీలకం. పశువు అనారోగ్యానికి గురైతే రైతు కుటుంబం ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోతే రైతుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ వైద్య సేవలు అందక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తే ఆ ఖర్చు ఎవరు భరించాలి? మూగజీవాలు తమ బాధను చెప్పుకోలేవు కాబట్టి వాటి సమస్యలను అధికారులు కూడా పట్టించుకోరా? అన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. గత విమర్శలకూ స్పందన లేదా..? మార్పు ఎప్పుడు..? గతంలోనూ వైద్యాధికారిణి పనితీరుపై విమర్శలు వ్యక్తమైనప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకే అధికారికి రెండు కేంద్రాల బాధ్యతలు ఉన్న నేపథ్యంలో రెండు చోట్లా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా? విధుల సమయాలను ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమైంది..?

మండల స్థాయిలో పశువైద్య సేవల నిర్వహణపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైద్యాధికారిని హాజరు రికార్డులు, ఆసుపత్రి పని వేళలు, క్షేత్రస్థాయిలో అందించిన వైద్య సేవలు, రైతుల ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎలాంటి పరిశీలన జరిగింది? అన్నది వెల్లడించాల్సిన అవసరం ఉంది. కాగితాలపై విధులు నిర్వహించినట్లు చూపిస్తే సరిపోతుందా? క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత అధికారులకు లేదా?

జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలి!

చెన్నూరు, కల్లూరు పశువైద్య కేంద్రాల్లో వైద్యాధికారిని విధుల నిర్వహణపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హాజరు వివరాలు, వైద్య సేవల రికార్డులు, రైతుల ఫిర్యాదులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు తప్పని తేలితే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే ఇలాంటి ఆరోపణలు వినిపిస్తుంటే ఇక సామాన్య రైతు ఎవరిని ఆశ్రయించాలి? మూగజీవాల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనంగా ఉంటే ప్రజల అనుమానాలకు తెరపడేదెలా? ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తారా..? లేక రైతుల ఆవేదనను గాలికి వదిలేస్తారా..? వేచి చూడాలి.

చర్లలో సంగీత కళాకారుల ఐక్యవేదిక ఏర్పాటు.

- వాయిద్య కళాకారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం.. నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.
- అధ్యక్షుడు: సూదుల వెంకటేశ్వర్లు.
- ఉపాధ్యక్షుడు: సోంపాక మంగయ్య.

చర్ల, నవంబర్ 10 ఈ వార్త ప్రతినిధి:



వాయిద్య కళాకారుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన బ్యాండ్‌సెట్, విద్యుత్ సంగీత వాయిద్య కళాకారులు కలిసి సంగీత కళాకారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం చర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధి సంతపాకలో కోకిల నాగేంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చర్ల మండల అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య, సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బందెల చంటి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి కనపర్తి ఈదయ్య మాట్లాడుతూ సంగీత కళాకారుల సంఘం ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని అన్నారు. కళాకారులు తమలోని ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంఘం అభివృద్ధికి భవిష్యత్తులో ప్రభుత్వపరంగా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మచ్చ రామారావు, బందెల చంటి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన సంఘానికి అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కళాకారులంతా ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో సంగీత కళాకారుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడు: సూదుల వెంకటేశ్వర్లు

ఉపాధ్యక్షుడు: సోంపాక మంగయ్య

ప్రధాన కార్యదర్శి: కోకిల నాగేంద్రం

సహాయ కార్యదర్శి: జంజీరాల సంతోష్

కోశాధికారి: కొప్పుల రామకృష్ణ

సలహాదారులుగా సీనియర్ కళాకారులు తోటమల్ల విజయరావు, మడిపల్లి ముత్యం ఎన్నికయ్యారు.

కమిటీ సభ్యులుగా సూదుల సుధాకర్, తోటమల్ల అశోక్, చినిగిరి ప్రశాంత్, ఎస్.కె. వహీద్, గుర్రం లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూదుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోకిల నాగేంద్రం మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వృత్తులకు సంఘాలు, యూనియన్లు ఉన్నాయని, అదే విధంగా వాయిద్య కళాకారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. సంఘాన్ని అధికారికంగా నమోదు చేయించడంతో పాటు భవిష్యత్తులో మరింత బలోపేతం చేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.

గతంలో స్థానికంగా బ్యాండ్‌సెట్, సంగీత వాయిద్య కళాకారుల సేవలు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు తగ్గి ఆర్థికంగా నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించడం, వారి ప్రతిభను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం, వృత్తిపరమైన సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకోవడం, భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా చూడటమే సంఘం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఈ కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన బ్యాండ్‌సెట్, విద్యుత్ సంగీత వాయిద్య కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ ద్వితీయ మహాసభ.

- కరపత్రాలను ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో రాహుల్.

భద్రాచలం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ (టీజేఎంయూ), నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా (ఎన్‌యూజేఐ) అనుబంధంగా నిర్వహించనున్న ద్వితీయ మహాసభ కరపత్రాలను భద్రాద్రి జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఉదయ రాఘవేంద్ర , భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు జీ రామలక్ష్మణ్ తదితరులు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ జర్నలిస్టులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రతినిధుల కృషి ప్రశంసనీయమని అన్నారు. జర్నలిస్టులు వృత్తి విలువలు, నైతిక ప్రమాణాలను పాటిస్తూ సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా టీజేఎంయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్ ఆదేశాలతో నవంబర్ 21న పినపాక, భద్రాచలం నియోజకవర్గ స్థాయి ద్వితీయ మహాసభ సారపాక తాళ్ళగొమ్ముర గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం లక్ష్యంగా యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తూ హక్కుల సాధన కోసం సమష్టిగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ద్వితీయ మహాసభకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షులు ఎన్ హనుమంతరావు, పినపాక నియోజకవర్గ ఇంచార్జి జీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టీజేఎంయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి జీ ఉదయ్ రాఘవేంద్ర. తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్లలో పేదల ముసుగులో భూమాఫియా రాజ్యం.

- అక్రమార్కులు నిరుపేదలను నిలువునా మోసం చేశారు.
- అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం.
- మిగిలిన దరఖాస్తులనూ పరిశీలించి స్థలాలు కేటాయిస్తాం మంత్రి తుమ్మల.
- వాస్తవాలు తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేసిన జస్టిస్ చంద్రకుమార్.

ఖమ్మం నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారంలో పేదల ముసుగులో కొందరు అక్రమార్కులుభూమాఫియాగా ఏర్పడి, సమాంతర పాలన సాగించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా వెల్లడించారు. నిరుపేదల ఇళ్ల స్థలాల ఆశలను ఆసరాగా చేసుకుని వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ, భయానక వాతావరణాన్ని సృష్టించారని తెలిపారు. అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారంలో మిగిలిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా వెలుగుమట్లలో చోటుచేసుకున్న



పరిణామాలు, భూముల ఆక్రమణలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యలు, అధికారిక రికార్డుల్లోని వాస్తవాలను మంత్రి ఆయనకు వివరించారు.పోలీసులు వెళ్లలేని పరిస్థితి సూడో రాజ్యం వెలుగుమట్లలోని సర్వే నంబర్లు 147, 148, 149లో ఉన్న భూములకు సంబంధించి గతంలో భారీగా అక్రమ ఆక్రమణలు చోటుచేసుకున్నాయని మంత్రి వివరించారు. కొందరు వ్యక్తులు పేదల పేరుతో అక్రమ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, నిరుపేదల నుంచి డబ్బులు వసూలు చేస్తూ సొంతంగా సూడోరాజ్యాన్ని నడిపారని తెలిపారు. చివరకు పోలీసులు సైతం అక్కడికి వెళ్లలేని విధంగా భయానక పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ అమాయకులను నమ్మించి, వారి నుంచి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హైకోర్టు, సీసీఎల్ఏ ఆదేశాల మేరకే తొలగింపులుభూదాన్ భూముల్లో జరిగిన అక్రమ ఆక్రమణలపై హైకోర్టు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సీసీఎల్ఏ 2023లో జారీ చేసిన ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం చట్టబద్ధంగా తొలగింపు చర్యలు చేపట్టిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ చర్యలు నిరుపేదలకు వ్యతిరేకం కాదని, పేదల పేరుతో అక్రమాలకు పాల్పడిన భూమాఫియా నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకేనని వివరించారు.నన్ను తప్పుదోవ పట్టించారు. జస్టిస్ చంద్రకుమార్, మంత్రి తుమ్మల అధికారిక రికార్డులు, ఆధారాలతో సహా పూర్తి వివరాలను వెల్లడించడంతో జస్టిస్ చంద్రకుమార్ విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెలుగుమట్ల వ్యవహారం వెనుక ఇంతటి అక్రమాలు, భూమాఫియా కార్యకలాపాలు ఉన్నాయన్న వాస్తవాలు తనకు తెలియకుండా చేశారని, కొందరు వ్యక్తులు తప్పుడు సమాచారం ఇచ్చి తనను తప్పుదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం నిజమైన నిరుపేదలకు అన్యాయం జరగనివ్వబోమని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి విచారణలో అర్హులుగా గుర్తించిన వారికి ఇప్పటికే నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న దరఖాస్తులను సైతం సమగ్రంగా పరిశీలించి, నిజంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని, వారి ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి తేల్చిచెప్పారు.

కొమ్మినేపల్లి ఉన్నత పాఠశాల లో సందడిగా 'మాక్ పార్లమెంట్.

- అందర్నీ ఆకట్టుకున్న విద్యార్థుల మంత్రుల వేషధారణ ప్రసంగాలు.
- ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులను చాటి చెప్పేందుకే పాఠశాలలో మాకు పార్లమెంట్ నిర్వహణ.
- ప్రధానోపాధ్యాయురాలు పి.జ్యోతి.

కామేపల్లి నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి పి.ఎం.శ్రీ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'మాక్ పార్లమెంట్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయురాలు అరుణ,ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులను కళ్లకు కట్టారు.దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్,





స్పీకర్, ప్రైమ్ మినిస్టర్, వివిధ శాఖల మంత్రులు,ప్రతిపక్ష నాయకుల వేషధారణలతో పార్లమెంట్ సమావేశాలను తలపించేలా అసలు సిసలైన వాతావరణాన్ని తలపింపజేశారు.ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ విద్యార్థులు రామ్ చరణ్ (స్పీకర్), నవ్య శ్రీ (ప్రెసిడెంట్), సాత్విక్ (వైస్ ప్రెసిడెంట్), శైలజ (హోమ్ మినిస్టర్), హాసిని (ట్రాన్స్పోర్ట్ మినిస్టర్)గా వ్యవహరించగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు సిద్ధార్థ (ప్రైమ్ మినిస్టర్), రోహిత (హెల్త్ మినిస్టర్), హరిణి (అగ్రికల్చర్ మినిస్టర్), వర్షిత్ (యూత్ అండ్ వెల్ఫేర్ మినిస్టర్)లుగా తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా పోషించారు.అలాగే విక్రమ్ తేజ్ (ఫైనాన్స్ మినిస్టర్), హరివీర తేజ (అపోజిషన్ మెంబర్) లతో పాటు జోషిక, కళ్యాణి, యామిని, లాస్య, రేణుక, సాయిదివ్య, ఉదయ్ భార్గవ్, నౌసిక్, భార్గవి, మురళి తదితర విద్యార్థులు వివిధ పాత్రల్లో జీవించారు.ఇంగ్లీష్, తెలుగు భాషలలో విద్యార్థులు వ్యక్తపరిచిన వాగ్ధాటి, సమకాలీన అంశాలపై వేసిన ప్రశ్నలు, ఇచ్చిన సమాధానాలు ప్రేక్షకులను విద్యార్థులను గ్రామ ప్రజలను ఆలోచింప జేసేవి గా ఉన్నాయి.వివిధ వేషధారణ వేసిన విద్యార్థులు పలువురు ఉపాధ్యాయులు గ్రామస్థుల నుంచి విశేష ప్రశంసలు పొందారు.

మణుగూరు ఎక్సైజ్ శాఖలో అహంకారంతో అధికార దుర్వినియోగమా...?

- సమాచారం అడిగితే సమాధానం చెప్పరు.. ప్రశ్నించిన వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి బెదిరింపులా...?
- ఆర్టీఐ దరఖాస్తుదారుడినే టార్గెట్ చేస్తున్నారా? ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న సిబ్బంది...!
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన శూన్యం.. బాధ్యత ఎవరిది...?.

మణుగూరు నవంబర్ 10 మీ వార్త ప్రతినిధి:

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వ శాఖలే ప్రశ్నించే పౌరుల పట్ల దురుసుగా వ్యవహరిస్తే ఇక సామాన్యుడికి న్యాయం ఎక్కడ దక్కుతుంది? మణుగూరు సబ్‌డివిజన్ ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న పరిణామాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ప్రభుత్వ శాఖల పనితీరు, అధికారుల బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సమాచారంపై ప్రశ్నిస్తూ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) కింద ఒక వ్యక్తి సమాచారం కోరినట్లు తెలుస్తోంది. అయితే ఆ దరఖాస్తును సంబంధిత సమాచారం కోసం మణుగూరు సబ్‌డివిజన్ ఎక్సైజ్ కార్యాలయానికి బదిలీ చేసినప్పటికీ, ఇప్పటివరకు కోరిన సమాచారం అందించలేదని దరఖాస్తుదారుడు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో అసలు వివాదం మొదలైందని బాధితుడి ఆరోపణ...!

సమాచారం ఇవ్వాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, సమాచారం కోరిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖకు చెందిన ఒక కానిస్టేబుల్ అనుసరిస్తూ అతని ఇంటి వద్దకు వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడటం, గొడవకు దిగడం ఏమిటని బాధితుడు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ శాఖను





ప్రశ్నించినందుకు పౌరుడి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమా...?

ఈ విషయాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, బాధితుడి వాదన ప్రకారం స్పందన సంతృప్తికరంగా లేదని, "మాకెందుకు చెప్తున్నారు?" అన్న తరహాలో సమాధానం ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. మరి ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రజల పట్ల ఎలా వ్యవహరించాలి? సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడం నేరమా? ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రశ్నించిన వ్యక్తిని అనుసరించి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేయడానికి ఎవరు అధికారం ఇచ్చారు?

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు సూటి ప్రశ్నలు...!

1. ఆర్ టి ఐ దరఖాస్తును స్వీకరించి బదిలీ చేసినప్పటికీ కోరిన సమాచారం ఎందుకు అందించలేదు?
2.సమాచారం కోరిన వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్‌పై విచారణ జరిపిస్తారా?
3.ఆర్టీఐ దరఖాస్తుదారుడిని అనుసరించాల్సిన అవసరం ఏమిటి? దీనికి శాఖాపరమైన అనుమతి ఉందా?
4.సూపరింటెండెంట్ దృష్టికి ఫిర్యాదు వెళ్లినప్పుడు బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం లేదా?

చివరిగా ఒక్కటే ప్రశ్న...

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు, ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ప్రశ్నించిన వారినే ఇబ్బందులకు గురిచేస్తే ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి? సమాచారం అడిగినందుకు వేధింపులకు గురవుతున్నానని ఒక పౌరుడు ఆరోపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ కమిషనర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని చట్టబద్ధమైన గడువులో అందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రశ్నించే గొంతును అణచివేయడం కాదు.. ప్రశ్నలకు సమాధానం చెప్పడమే ప్రభుత్వ శాఖల బాధ్యత...!

ఇరాన్‌పై మళ్లీ యుద్ధం.. అత్యంత అసంభవం:

ట్రంప్ : ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేయాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశాలు అత్యంత తక్కువ అని అన్నారు. అయితే.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు, హోర్ముజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశాలపై గట్టి ఒప్పందం కుదరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ డీల్‌కు ఇరాన్ అంగీకరించకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.పశ్చిమాసియాలో అమెరికా 3 విమాన వాహక యుద్ధనౌకలను మోహరించిందని, అవి పూర్తిస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే.. వాటిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టొచ్చని, అందుకే అలాంటి చర్యలు తీసుకోవడం తనకిష్టం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పశ్చిమాసియా దేశాలు దౌత్య ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఖతార్ రాజుతో ట్రంప్ చర్చలు జరిపారు. మరోవైపు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, పాకిస్థాన్, టర్కీ సహా పలు దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. అయితే.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాత్రం చర్చల్లో తక్షణ పురోగతి కనిపిస్తోందని చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధాన మంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించు కోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. "ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను మరింత కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా నివారణ చర్యలను ముమ్మరం చేశాయి. గత ఏడాది కాలంలో సరిహద్దులకు అవతల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయి. ఈ క్రమంలో 300 మందికి పైగా ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారిని అరెస్టు చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట పేలుడు నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి దాడులను అడ్డుకునేందుకు కేంద్ర నిఘా సంస్థలు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం' ను ప్రవేశపెట్టాయి. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తామని 2026 సెప్టెంబర్‌లో జరిగిన రాష్ట్రాల డీజీపీలు, కేంద్ర భద్రతా సంస్థల అధిపతుల ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగా పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్'పై దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్లలో 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న హ్యాండ్ గ్రెనేడ్లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద గాదీచీను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించినట్లు పేర్కొన్నారు.

విదేశాల నుంచి 73 మంది నిందితుల అప్పగింత

ఉగ్రవాదులకు విదేశాల్లో ఆశ్రయం లభించకుండా కేంద్రం దౌత్యపరమైన చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. గత ఏడాది కాలంలో వివిధ దేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాద నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

పేలుడు పదార్థాల విక్రయాలపై నిఘా

బాంబుల తయారీలో ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్ విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యువతలో ఉగ్రవాద భావజాలం వైపు మొగ్గుచూపే సంకేతాలు, ప్రవర్తనలో వచ్చే మార్పులపై కూడా నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ప్రస్తుతం అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల విక్రయాలపై ఆకస్మిక తనిఖీలతో పాటు పలు నియంత్రణ చర్యలు అమల్లో ఉన్నాయి" అని ఓ అధికారి పేర్కొన్నారు.

పలు ఉగ్రవాద మాడ్యూళ్ల నిర్వీర్యం

కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా పలు ఆపరేషన్లు నిర్వహించి ఉగ్రవాద మాడ్యూళ్లను నిర్వీర్యం చేసినట్లు తెలిపాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జేవీవీ), లష్కరే-తైబా (గ్రూమా) వంటి నిషేధిత సంస్థలకు మద్దతుగా పనిచేస్తున్న వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తులపై కూడా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్‌లను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంతో పాటు, పలువురు కీలక వ్యక్తులు అరెస్టయ్యారని తెలిపారు. బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద ముప్పులపైనా నిఘా పెంచారు. అసోం, పశ్చిమబెంగాల్, త్రిపుర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేవీడీ) భావజాలంతో ప్రభావితమైన 27 మంది కార్యకర్తలను అరెస్టు చేసినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి.

పదేళ్లలోనే పెను మార్పు..

భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది. రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది.



'ఇట్లు అర్జున' ఈవెంట్‌లో రామ్ చరణ్ టంగ్ స్లిప్.. 'కాకా' మూవీపై బిగ్ అప్‌డేట్!

మహేష్ రెడ్డి తనయుడు అనీష్ హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు వెంకీ కుడుముల నిర్మాతగా వ్యవహరిస్తుండగా.. కింగ్ నాగార్జున సమర్పిస్తున్నారు. అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం జోరుగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో గ్రాండ్‌గా మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ వేడుకకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఈ కార్యక్రమంలో చరణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'ఇట్లు అర్జున' సినిమాలో హీరో అనీష్ మూగవాడి పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా నిలిచిన 'రంగస్థలం' సినిమాను గుర్తుచేసుకున్నారు. "రంగస్థలం సినిమాలో నేను చేసిన మూగవాడి పాత్ర కంటే.. ఈ సినిమాలో అనీష్ చేస్తున్న మూగవాడి క్యారెక్టర్ ఇంకా పెద్ద హిట్ అవ్వాలి" అంటూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అయితే ఇక్కడే చరణ్ నోటి నుంచి చిన్న పొరపాటు దొర్లింది. 'రంగస్థలం' సినిమాలో ఆయన పోషించిన చిట్టిబాబు పాత్రకు వినికిడి లోపం ఉంటుంది. అంటే ఆ పాత్ర చెవిటిది కానీ మూగది కాదు. అయితే ప్రసంగం మధ్యలో ఫ్లోలో చరణ్ మూగవాడి పాత్ర అంటూ పేర్కొనడంతో అభిమానులు ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. సరదాగా మీమ్స్ కూడా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనస్వర రాజన్ గురించి కూడా రామ్ చరణ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. భవిష్యత్తులో టాలీవుడ్‌లో ఆమె మంచి స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇట్లు అర్జున' సినిమాలో అనీష్, అనస్వర రాజన్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని, ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చరణ్ అభిప్రాయపడ్డారు.అనస్వర రాజన్ ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'కాకా'లోనూ నటిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన తండ్రి చిరంజీవిని గుర్తుచేసుకుంటూ సరదాగా వ్యాఖ్యానించారు. "అనస్వర మా నాన్నగారి 'కాకా' సినిమాలో కూడా అద్భుతమైన పాత్ర చేస్తోంది. అయితే మా నాన్నగారిలాగా 'చిరు లీక్స్' పేరుతో నేను ఆమె క్యారెక్టర్ ఏంటనేది ఇప్పుడే లీక్ చేయను" అంటూ నవ్వులు పూయించారు. ఇక 'కాకా' సినిమా విజయంపై రామ్ చరణ్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. "ఈ సంక్రాంతికి 'కాకా' సినిమాతో మేం పక్కాగా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం" అంటూ ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. దీంతో అక్కడున్న మెగా అభిమానులు కేరింతలు, అరుపులతో సందడి చేశారు.

వరుస సినిమాలతో విజయ్ సేతుపతి బాక్సాఫీస్ దండయాత్ర.. రెండు నెలల్లో రెండు చిత్రాలు..!



'బత్తా' సినిమా విజయంతో మంచి జోష్‌లో ఉన్న కోలీవుడ్ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఇప్పుడు వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇకపై బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో థియేటర్లలో సందడి చేయబోతున్నారు. ఇప్పటికే ఆయన నటిస్తున్న పలు క్రేజీ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధమవుతుండగా, మరికొన్ని చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా రాబోయే కొన్ని నెలల్లో విజయ్ సేతుపతి సినిమాలు వరుసగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. విజయ్ సేతుపతి నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'ట్రైన్' ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ దర్శకుడు మిస్కిన్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మిస్కిన్ తనదైన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం విజయ్ సేతుపతి అభిమానులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి. 'ట్రైన్' విడుదలైన కొద్ది వారాలకే విజయ్ సేతుపతి మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న 'పాకెట్ నావెల్' (గ్రాశీఎఎవ్ చీశీజవశ్రీ) చిత్రాన్ని పొంగల్ కానుకగా జనవరి 14న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. విభిన్నమైన కథాంశాలతో సినిమాలు రూపొందించే త్యాగరాజన్ కుమారరాజా, విజయ్ సేతుపతి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇలా డిసెంబర్, జనవరి నెలల్లో వరుసగా రెండు సినిమాలు విడుదల కానుండటం విశేషం. ఇక విజయ్ సేతుపతి కెరీర్‌లో మరో కీలకమైన ప్రాజెక్ట్ 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' (గ్రాశ్రీబఎఎశీస్త్ర 33 ఎవఎజూశ్రీవ =శ్రీఎ). డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల విషయంలో ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ డీల్ త్వరలోనే కొలిక్కి వస్తే, సినిమాను 2027 ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ మార్క్ యాక్షన్, విజయ్ సేతుపతి నటన కలిస్తే సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. మరోవైపు విజయ్ సేతుపతి నటిస్తున్న 'ఇంజి వెల్లం' సినిమా విడుదల తేదీపై కూడా చర్చ జరుగుతోంది.

రాజమౌళి వారణాసి.. తెలుగు రాష్ట్రాల్లో భారీ డీల్..!



రాజమౌళి-మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ అండ్ అవైటేడ్ మూవీ వారణాసి. ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ వారణాసిపై అభిమానుల్లో భారీ ఆశలు పెంచేశాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది చివరికీ షూట్ ముగించేలా ప్లాన్ చేస్తున్నారు దర్శకధీరుడు. ఈ నేపథ్యంలోనే వారణాసికి సంబంధించి ఓ క్రేజీ టాక్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ థియేట్రికల్ రైట్స్ కోసం భారీ డీల్ కుదిరిందని తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషలకు సంబంధించిన థియేట్రికల్ రైట్స్ భారీ ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ఈ మూవీ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ దాదాపు రూ.290 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకున్నారని టాలీవుడ్ లేటేస్ట్ టాక్. అయితే దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రకటనైతే రాలేదు.భాషలు నేర్చుకోండి కాగా.. ఈ చిత్రాన్ని 2027, ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజమౌళి చెప్పిన ప్రకారం 'వారణాసి'లో రాముడు జీవించిన త్రేతాయుగం సీన్స్ కూడా ఉండనున్నాయి. ఇందులో భాగంగా మహేశ్.. శ్రీరాముడిగానూ కనిపించనున్నాడు.


పింక్ శారీలో
శ్రీనిధి శెట్టి
పరువాల జాతర..
ఫొటోలు చూస్తే
ఫిదా అవ్వాల్సిందే!